# నమస్తే తెలంగాణ
# మెదక్
I | హైదరాబాద్, సోమవారం 17 ఫిబ్రవరి 2025 | MEDAK


## కేసీఆర్‌ను కలిసిన ముస్త్యాల దంపతులు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ముస్త్యాల దంపతులు

చేర్యాల, ఫిబ్రవరి 16: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, చేర్యాల మాజీ సర్పంచ్ ముస్త్యాల అరుణ శనివారం రాత్రి కలిశారు. ముస్త్యాల బాల్‌నర్సయ్య పుట్టిన రోజు సందర్భంగా కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు కొమురవెల్లి మల్లికార్జున స్వామి ప్రసాదాన్ని అందించారు. వారితో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, యూత్ ఇన్‌చార్జి శివగారి అంజయ్య ఉన్నారు.

## మాజీ ఎంపీపీకి హరీశ్‌రావు పరామర్శ



ఎర్ర యాదయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు


సిద్దిపేట, ఫిబ్రవరి 16: సిద్దిపేట రూరల్ మండల మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర యాదయ్య తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం బుస్సాపూర్‌లో యాదయ్యను పరామర్శించి సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంట సూడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకుడు యాదయ్య ఉన్నారు.

## మొక్కలు నాటిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్



చేర్యాలలో మొక్కలు నాటుతున్న అంకుగారి దంపతులు

చేర్యాల, ఫిబ్రవరి 16: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం చేర్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి దంపతులు మొక్కలు నాటారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటామన్నారు. కేసీఆర్ పాలన కోసం తెలంగాణ ప్రజలు వేచి చూస్తున్నారని, త్వరలో ప్రజలు కోరుకుంటున్న విధంగా కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి వచ్చి అధికార పార్టీ చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను తిప్పికొడుతారన్నారు.



ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

## పెద్దమ్మతల్లి ఉత్సవాలకు ఆహ్వానం

సిద్దిపేట, ఫిబ్రవరి 16: నారాయణరావుపేట మండలం శేఖర్‌రావుపేటలో ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు జరిగే పెద్దమ్మతల్లి ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును ఆదివారం గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

# బీఆర్ఎస్ ఎప్పుడూ ప్రజల పక్షమే



కొండపాక: రవీంద్రనగర్ వద్ద మహిళలతో కలిసి బోనమెత్తిన ఎమ్మెల్సీ కవిత



కుకునూర్‌పల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

- ఎమ్మెల్సీ కవిత

కొండపాక (కుకునూర్‌పల్లి) ఫిబ్రవరి 16: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆదివారం భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల ప్రశాంత్, ఎంపీటీసీల ఫోరం మాజీ రాష్ట్ర కన్వీనర్ దేవీ రవీందర్, బీఆర్ఎస్ ఉమ్మడి కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కుకునూర్‌పల్లి, కొండపాక మండలాల నాయకులు, మహిళలు, యువకులు బోనాలు, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. గులాబీ పూల వర్షం కురిపించి జై కేసీఆర్, జై కవితక్క అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన ఎప్పుడూ పోరాడుతుందని తెలిపారు. తెలంగాణలో మళ్లీ రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో అబద్ధాలు, అసమర్ధ పాలన కొనసాగుతోందని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో కోల సద్గుణా రవీందర్, పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, సింగారం రాములు, మంద ఐలయ్య, కోడెల రవి, సందీప్‌చారి, అమరేందర్, ఐలయ్య, కిరణ్, మహిపాల్, తదితరులు ఉన్నారు.

**ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం**

సిద్దిపేట, ఫిబ్రవరి 16: సిద్దిపేటలో ఆదివారం శుభకార్యాల్లో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు తెలంగాణ జాగృతి కార్యకర్తలు సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల వద్ద ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి పూలు చల్లి కవితకు గ్రాండ్ వెల్కమ్ చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత కార్యకర్తలకు, అక్కడికి వచ్చిన ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం సిద్దిపేట పోలీసు కన్వెన్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవితతో పలువురు మహిళలు, పట్టణవాసులు ఫొటోలు దిగారు.

**ప్రజ్ఞాపూర్‌లో ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం**

గజ్వేల్, ఫిబ్రవరి 16: ఎమ్మెల్సీ కవితకు గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై బీఆర్ఎస్ శ్రేణులు ఆదివారం ఘనస్వాగతం పలికారు. సిద్దిపేట వెళ్తున్న సందర్భంగా ప్రజ్ఞాపూర్ వద్ద కవితను ఆపి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో వివాహానికి హాజరై ఓ చిన్నారిని ఒడిలో కూర్చోబెట్టుకున్న ఎమ్మెల్సీ కవిత



సిద్దిపేట: ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం పలుకుతున్న తెలంగాణ జాగృతి కార్యకర్తలు



గజ్వేల్: ప్రజ్ఞాపూర్ వద్ద కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

# రైతుభరోసా పేరిట కాంగ్రెస్ మోసం

- 40 శాతం రైతులకు పెట్టుబడి సాయం ఎగవేత
- 13వేల ఎకరాలకు రైతు భరోసా రావాల్సి ఉంది
- రైతులకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ప్రభుత్వంపై నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆగ్రహం



నారాయణఖేడ్, ఫిబ్రవరి 16: రుణమాఫీ తరహాలోనే రైతు భరోసా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసానికి గురిచేస్తున్నదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 60శాతం రైతులకు రైతుభరోసా రాలేదన్నారు. అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉందన్నారు. నాగల్‌గిద్ద మండలంలో మూడెకరాల్లోపు పట్టాదారులకు 13 వేల ఎకరాలకు రైతు భరోసా రావాల్సి ఉండగా, కేవలం 8 వేల ఎకరాలకు మాత్రమే రైతు భరోసా డబ్బులు జమ అయినట్లు తెలిపారు. ఈ లెక్కన ప్రభుత్వం ఈ ఒక్క మండలంలోనే 40 శాతం పంట పెట్టుబడి సాయం ఎగబెట్టిందని మండిపడ్డారు. నాగల్‌గిద్ద మండలం శేరిదా మరగిద్దలో 31 సర్వేనంబర్‌లో ఉన్న 525 ఎకరాలకు ఒక్క ఎకరానికి కూడా రైతు భరోసా డబ్బులు వేయలేదన్నారు. ఈ సర్వే నంబర్‌లో గిరిజనులు, నిరుపేదలకు భూములు ఉన్నాయని, ప్రభుత్వ సహాయం పేద రైతులకు అందించకుండా పథకం లక్ష్యం నిర్వీర్యం అవుతోందన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చిన్న చిన్న సాంకేతిక లోపాలతో రైతుబంధు డబ్బులు జమకాకపోతే తాను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి లోపాన్ని సవరించి ప్రతి ఒక్కరికీ రైతుబంధు వచ్చేలా చర్యలు తీసుకున్నట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి వెంటనే స్పందించి ప్రతి రైతుకూ రైతు భరోసా వచ్చేలా చర్యలు తీసుకోవాలని భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులకు కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హెచ్చరించారు.

# వేతన వెతలు

## ఐసీయూ, బ్లడ్ బ్యాంక్ ఉద్యోగులకు అందని వేతనాలు

- ఏడు నెలల వేతనాల కోసం ఎదురుచూపులు
- తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబాలు
- మెదక్ జిల్లా దవాఖానలో 32మంది ఉద్యోగులు
- రెండు శాఖల మధ్య సమన్వయ లోపమే కారణం



మెదక్‌లోని జిల్లా కేంద్ర దవాఖాన

మెదక్, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ): ఏడు నెలలుగా వేతనాలు లేక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ వైద్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని దీనస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మెదక్ జిల్లా కేంద్ర దవాఖానలోని ఐసీయూ, బ్లడ్ బ్యాంక్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ వైద్యులకు ఏడు నెలలుగా వేతన బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒకవైపు పెరుగుతున్న పని ఒత్తిడి, మరోవైపు ఆర్థిక సమస్యలు వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. గట్టిగా నిలదీస్తే పైస్థాయిలో వేధింపులు తప్పడం లేదని వాపోతున్నారు. తీరిక లేని విధులతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ వైద్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విరామం లేకుండా విధులు నిర్వహిస్తుండడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు రెండు లేక మూడు నెలలకోసారి ఇవ్వడంతో ఆర్థికంగా దెబ్బతింటున్నారు.


**మెదక్ జిల్లాలో 32 మంది ఉద్యోగులు**

మెదక్ జిల్లా కేంద్ర దవాఖానలోని ఐసీయూ, బ్లడ్ బ్యాంక్‌లో డాక్టర్లు, సిబ్బంది 32 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఐదుగురు డాక్టర్లు కాంట్రాక్ట్ పద్ధతిన, ఆరుగురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ ఒకరు, ఎక్స్‌రే టెక్నీషియన్ ఒకరు, వెంటిలేటర్ టెక్నీషియన్ ఒకరు, ఎంఎన్‌వోలు ఆరుగురు, ఐఎన్‌వోలు ఇద్దరు, సెక్యూరిటీ గార్డులు ముగ్గురు ఉన్నారు. బ్లడ్ బ్యాంక్‌లో స్టాఫ్ నర్సులు ఇద్దరు, ల్యాబ్ టెక్నీషియన్‌లు ఇద్దరు, డాటా ఎంట్రీ ఆపరేటర్, ల్యాబ్ అటెండర్, డ్రైవర్ ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. డాక్టర్లకు నెలకు రూ.50వేల వేతనం, మిగతా సిబ్బందికి రూ.15 వేలు, కొందరికీ రూ.20వేల చొప్పున ఇస్తున్నారు. ఏడు నెలల వేతనాల బకాయిలు ఉన్నాయి.

**సమన్వయ లోపమే కారణం..!**

ఒకవైపు తెలంగాణ వైద్య విధాన పరిషత్, మరోవైపు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పెండింగ్ వేతనాల చెల్లింపుల్లో తమది కాదంటే తమది కాదంటూ చేతులెత్తేస్తున్నాయి. దీంతో రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ డాక్టర్లు నలిగిపోతున్నారు. మెదక్ పట్టణ శివారులోని పిలికొట్యాల సమీపంలో నూతనంగా మెడికల్ కళాశాల ప్రారంభమైన విషయం తెలిసిందే. దీంతో జిల్లా కేంద్ర దవాఖాన ఇటు, వైద్య విధాన పరిషత్ అటు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో పనిచేస్తున్నాయి. ఐసీయూ, బ్లడ్ బ్యాంకుల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ డాక్టర్లకు మెడికల్ కళాశాల ప్రారంభం కాక ముందే ఉన్న రెండు నెలల పెండింగ్ వేతనాలతో పాటు మరో ఐదు నెలల వేతనాలు అందలేదు. వేతనాల విషయమై టీవీవీపీ అధికారులను అడగగా, దవాఖానను డీఎంఈ పరిధిలోకి మార్చినందున వేతనాలు ఆ శాఖనే చెల్లిస్తుందని సమాధానం ఇస్తున్నారని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. డీఎంఈ అధికారులను అడిగితే దవాఖాన తమ శాఖ పరిధిలోకి వచ్చినట్టు తమకు అధికారికంగా ఉత్తర్వులు రాలేదని చెబుతున్నారని అంటున్నారు. దీంతో రెండు శాఖల మధ్య సమన్వయ లోపంతో తమకు వేతనాలు రావడం లేదని కాంట్రాక్ట్ డాక్టర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతినెలా వేతనం ఇవ్వాలి..**



ఐసీయూలో పనిచేస్తున్న తమకు ప్రతినెలా వేతనం అందించాలి. ఏడు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పులు తెచ్చి కుటుంబాలను పోషించుకుంటున్నాం. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు స్పందించి వేతనాలు ఇప్పించాలి.

– బాలమణి, ఐసీయూ స్టాఫ్ నర్సు

**ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలి**



సర్కార్ వేతనాలు విడుదల చేయాలి. అన్నింటికీ అప్పులు చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని సంతోషపడ్డాం. నెల నెలా జీతం వస్తుందని అనుకున్నాం. ఏడు నెలలుగా జీతం రాకపోతే కుటుంబం ఎలా బతుకుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు ఇవ్వాలి.

– బషీర్, బ్లడ్ బ్యాంక్ అటెండర్

**అప్పులు చేస్తున్నాం..**



రెండు శాఖల మధ్య సమన్వయం లేకనే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ డాక్టర్లకు వేతనాలు రావడం లేదు. ఇప్పటికే తలకు మించిన అప్పులు చేసి కష్టపడుతున్నాం. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాం. ఏడు నెలల వేతనాలు ఒకేసారి చెల్లించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– శివకుమార్, ఐసీయూ ల్యాబ్ టెక్నీషియన్

# కదంతొక్కిన మహిళాలోకం

## ప్యారానగర్‌లో డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ ఉధృతమవుతున్న ఆందోళనలు

- గుమ్మడిదలలో ఆరో రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న అంబేద్కర్ సంఘం సభ్యులు
- హైవేపై యువకుల భారీ బైక్‌ర్యాలీ
- గుమ్మడిదలలో జాతీయ రహదారిపై మహిళల ఆందోళన
- సంఘీభావం తెలిపిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- నల్లవల్లి, కొత్తపల్లిలో 12వ రోజు కొనసాగిన రిలే నిరాహార దీక్షలు



డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలంటూ గుమ్మడిదలలోని హైవేపై మహిళలతో కలిసి ఆందోళన చేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

గుమ్మడిదల, ఫిబ్రవరి 16: ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గుమ్మడిదల మండలంలో ఆందోళనలు కొనసాగాయి. గుమ్మడిదలలో రైతు జేఏసీ కమిటీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అఖిపక్ష నాయకులు, రైతు సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు జాతీయ రహదారి–765డీ పై భారీ ర్యాలీ నిర్వహించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినా పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు వద్దకు మహిళలు ర్యాలీగా వెళ్లారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మా రెడ్డి అక్కడికి చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు, నిరసనకారులకు మధ్య తోపులాట జరిగింది. జై జవాన్.. జై కిసాన్, సేవ్ ఫారెస్ట్, సేవ్ ఫార్మర్ నినాదాలు మిన్నంటాయి. మహిళా పోలీసులు మహిళలను డంపింగ్‌యార్డు వైపు వెళ్లకుండా అడ్డుకున్నారు.

**యువకుల బైక్ ర్యాలీ...**

డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ఆదివారం జాతీయ రహదారిపై యువకులు పెద్దసంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గుమ్మడిదల నుంచి అన్నారం, ప్రకృతి నివాస్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్లవల్లి, కొత్తపల్లిలో 12వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. దోమడుగు, బొంతపల్లి గ్రామాల జేఏసీల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనల్లో రైతు జేఏసీ నాయకులు జైపాల్ రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, మాజీసర్పంచ్ నర్సింహారెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, స్వేచ్ఛారెడ్డి, వేణురెడ్డి, ఉదయ్‌కుమార్, కరుణాకర్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్య, రాంరెడ్డి, ఫయాజ్‌షరీఫ్, కుమ్మరి ఆంజనేయులు, కొత్తపల్లి మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**వెంటనే రద్దు చేయాలి: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. భూసర్వే చేసే వరకు పనులు నిలిపి వేయాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. డంపింగ్‌యార్డు పనులు జరుగుతున్నాయా, లేక నిలిపివేశారా అనే విషయంలో నిర్మాణ సంస్థ రాంకీ స్పష్టత ఇవ్వాలని, ఆందోళన చేస్తున్న వారికి డంపింగ్‌యార్డు పనులు ఆపింది లేనిది చూపించాల్సిన బాధ్యత లేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. డంపింగ్ యార్డులోకి అనుమతించక పోవడంపై పలు అనుమానాలు, అపోహలు వ్యక్తమవుతున్నాయని ఆమె తెలిపారు. 12 రోజులుగా పనులు వదులుకొని నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, గుమ్మడిదల, దోమడుగు, బొంతపల్లి తదితర గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించి డంపింగ్‌యార్డు అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డు చెత్త కంపుతో పచ్చని పల్లెల్లో పర్యావరణానికి విఘాతం కలుగుతుందని, భూగర్భ జలాలను, అడవులను, పంటలను నాశనం చేయొద్దని ప్రభుత్వానికి ఆమె విజ్ఞప్తి చేశారు.




గుమ్మడిదలలో ఆరో రోజు రిలే నిరాహార దీక్షలో అంబేద్కర్ సంఘం నాయకులు




దోమగుడులో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా జాతీయ రహదారిపై ర్యాలీ చేపట్టిన మహిళా సంఘాల సభ్యులు, రైతు జేఏసీ నాయకులు